


# అమెరికా ఇల్లాలి ముచ్చట్లు
## శ్యామలాదేవి దశిక



అమెరికా ఐనా, అమలాపురమైనా ఇల్లాలు..ఇల్లాలే. ముచ్చట్లు ముచ్చట్లే..

ఓ అమెరికా ఇల్లాలు నెల నెలా  మీతో పంచుకుంటున్న ముచ్చట్ల మురిపాలు..!

# సత్యలక్ష్మి

ఏమిటీ అంటున్నారూ?

ఈ డ్రెస్సులో నేను మార్వెలెస్‌గా వున్నానా?

మా వూళ్ళో వాళ్ళు నన్ను ఇలా చూశారంటే మూర్ఛపోతారా?!

ఆ ఇచ్చే కాంప్లిమెంటేదో సరిగ్గా ఇవ్వచ్చుకదా?

అస్తమానం నన్నూ, మాఊరిని ఎగతాళి చేయటం మీకు బాగా అలవాటయిపోయింది!

మూర్ఛపోతే పోతారు అయితే ఏమిటట? ఆ మాటకొస్తే ముప్పయి ఐదేళ్ళనాడు విమానం దిగిన నన్ను చూసి మీరు మూర్ఛపోలా? పావలా సైజు బొట్టుతో, రేగిపోయిన వాలుజడతో , నలిగిపోయిన వెంకటగిరి చీరలో వున్న నన్ను చూసికూడా చూడనట్టు నటించారు, గుర్తుందా?

నన్ను తీసుకొచ్చి ఆ నాలుగు గోడల మధ్య పడేసి మీపాటికి మీరు వెళ్ళిపోయేవారు. నన్ను మీతో పాటు బయటికి తీసుకెళ్ళడానికి నామోషీ వేసి, " ఇక్కడి చలి నీకు అలవాటు లేదు. నాకు శెలవ లేదూ" అంటూ వంకలు చెప్పేవారు. మీ ఫ్రెండు డా: జాన్ నేను వచ్చానని తెలిసి మనల్ని వాళ్ళింటికి డిన్నరుకు పిల్చాడు. గుర్తుందా? వేరే గత్యంతరం లేక నన్ను వాళ్ళింటికి తీసుకెళ్ళారు. మనం అక్కడున్నంతసేపు మీరు ముళ్ళమీద కూర్చున్నట్లు గడిపారు. పాపం జాన్ భార్య ప్రత్యేకంగా వెజిటేరియన్ ఫుడ్డే వండింది నాకోసం అని. నేను కట్టుకున్న చీరని, నా పొడుగాటి జడనీ ఒకటే మెచ్చుకొంది !

వున్నట్టుండి మీ ఫ్రెండు "వుడ్డుయూ లైక్ స్క్రూడ్రైవర్?" అని అడిగితే కంగారులో నేను వెంటనే "నో, ఐ లైక్ పట్టకారు" అన్నాను. మీరు పళ్ళు కొరకడం వినిపించి పప్పులో కాలేసానని తెలుసుకున్నాను. ఆ మాటకొస్తే, మీరు మాత్రం తక్కువతిన్నారా? మీ ఫ్రెండ్స్ మీ గురించి అంతా చెప్పారులేండి !

వచ్చిన కొత్తల్లో మాటిమాటికి రిపేర్లకొచ్చే మీ డొక్కుకారు గురించి మీరు చెప్తుంటే మీ ఫ్రెండు "యు షుడ్ గెట్ రిడాఫ్ దట్ లెమన్" అంటే 'నేను నా కారు గురించి మాట్లాడుతుంటే వీడు నిమ్మకాయ పారేయమంటాడేమిటీ, అయినా నా ఫ్రిజ్ లో వున్న నిమ్మకాయ

సంగతి వీడికెందుకూ' అని విసుక్కున్నార్టకదా?!!
ఒకసారి కాన్ఫెరన్స్‌లో వున్న మిమ్మల్ని పేజ్ చేయటం విని మీ బాస్"డాక్టర్ రావ్, యు అర్ ఎక్స్యూజుడ్" అన్నాడని 'నేను ఇప్పుడు ఏం తప్పు చేసానని క్షమించానంటున్నావ్' అంటూ దెబ్బలాటకు దిగార్టకదా !

ఆ రోజుల్లో చదువులో, వయసులో, అనుభవంలో అన్నింట్లో తక్కువైన నేను మీముందు ఒక వెర్రిమొహంలా కనిపించేదాన్ని. కాని బయటికి వెళ్ళినప్పుడు మీరూ అంతే అని నెమ్మదిమీద తెలుసుకొన్నాను. డ్యూటీ పేరుతో రెండేసి, మూడేసి రోజులు వరసాగ్గా హాస్పిటల్లో వుండిపోయేవారు. నాకు ఇంట్లో ఏమీ తోచేదికాదు. ఒకరోజు మన లాండ్ లేడి కూతురు లూసీతో పాటు నేనూ కోర్సులు తీసుకోటానికి రిజిష్టరు చేసుకున్నాను. పీయూసీ క్వాలిఫికేషన్ తో అమెరికాలో చదవటం అంటే అనపర్తిలో చదివినట్టుకాదని నన్ను ఆట పట్టించేవారు గుర్తుందా? !

నాకు తెలియనివి మీదగ్గర చెప్పించుకోడానికి (అప్పట్లో) మీకు బోలెడు లంచాలు ఇచ్చుకునేదాన్ని ! కాలక్షేపానికని చేరిన నేను మాస్టర్స్ డిగ్రీ పుచ్చుకునేసరికి మనకి ముగ్గురు పిల్లలు పుట్టేసారు. ఎంతైనా పల్లెటూరి అమ్మాయిలకు పట్టుదల ఎక్కువ అంటూ ఓ కాంప్లిమెంట్ విసిరారు మీరు.

ఆ తర్వాత ఉద్యోగంలో చేరడం, ప్రమోషన్లు రావడం, పిల్లలు పెరిగి పెద్దవాళ్ళవటం అంతా చెకచెకా జరిగిపోయింది. ఆ రోజుల్లో పిల్లలకు హోంవర్కులో సాయం చేస్తున్నప్పుడల్లా నాకు చాలా గర్వంగా వుండేది. " Mom explains better.  She  is smarter than you Dad"
అని పిల్లలు అన్నప్పుడల్లా మీరు తెగ వుడుక్కునేవారు !! గుర్తుందా ?

ఈ ప్రపంచం ఎంత విశాలమైనదో, మనసుండాలేకానీ ఎన్ని నేర్చుకోవచ్చో, సమాజానికి ఎంత ఉపయోగపడచ్చో , అనపర్తి వదలి అమెరికా వచ్చాకగాని నాకు తెలియలేదు. చిన్నప్పుడు అమ్మ చేతికి పలక, బలపం ఇచ్చి బడికి వెళ్ళమంటే వెళ్ళనని మొరాయించేదాన్ని. ఒక్కసారి వెనక్కి తిరిగి గతంలోకి చూసుకొంటే ఇంత దూరం వచ్చింది వెంకటసత్యలక్ష్మిని నేనేనా అని మీకే కాదు, నాకూ ఆశ్చర్యం వేస్తుంది !!